పల్లెల్లో గుడుంబా మత్తు..!

- కోకొల్లలుగా తయారీ కేంద్రాలు
- ప్యాకెట్ల ద్వారా ఇతర ప్రాంతాలకు..
- నామమాత్రంగా అధికారుల దాడులు

బయ్యారం : పల్లెల్లో గుడుంబా మత్తు గుప్పుమంటోంది.. నిషేధిత పదార్థాలు వినియోగించి తయారు చేసిన నాటుసారా పలువురి ప్రాణాలను హరించేలా ఉంది. గ్రామాల్లో ఇష్టానుసారంగా గుడుంబా తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్న అధికారులు మాత్రం నామమాత్రపు దాడులతో సరిపెట్టుతున్నారు. దీంతో గుడుంబా తయారీ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతోంది. అయితే తయారు చేసిన గుడుంబాను ఇతర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల ద్వారా ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. అధికారులు మాత్రం గుడుంబా తయారీని అరికట్టడంలో విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి.


ఓ గ్రామంలో తయారు చేస్తున్న గుడుంబా

రాత్రి వేళ నల్లబెల్లం..
తెల్లవారుజామున గుడుంబా ప్యాకెట్ల రవాణా..

గుడుంబా తయారీకి ప్రధాన ముడిసరుకు నల్లబెల్లం, పటిక. దీంతో వీటిని కొందరు రాత్రివేళ తయారుదారుల ఇళ్లకు సులువుగా చేరుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బెల్లం, పటికతో పాటు మత్తు ఎక్కువగా వచ్చేందుకు శరీరానికి హానికరమైన పలు వస్తువులను ఉపయోగించి గుడుంబాను తయారు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మరో వైపు తయారు చేసిన గుడుంబాను ప్యాకెట్లు, ప్లాస్టిక్ సీసాల ద్వారా తెల్లవారుజామున విక్రయించే పాయింట్ల వద్దకు చేరుస్తున్నట్లు తెలుస్తోంది.

ధర తక్కువ.. మత్తు ఎక్కువ

మద్యం రేటు కంటే పలు రకాల విష పదార్థాలతో తయారు చేసిన గుడుంబాకు ధర తక్కువ.. అలాగే మత్తు ఎక్కువగా ఉండటంతో మద్యంప్రియులు ఎక్కువగా గుడుంబాకు బానిస అవుతున్నారు. చివరికి యువకులు సైతం గుడుంబాకు బానిసై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు గుడుంబా తయారీ, విక్రయదారులపై కఠినచర్యలు తీసుకోవాలని మహిళలు, ఇతరసంఘాల నాయకులు కోరుతున్నారు.

ఆర్టీఐపై అవగాహన ఉండాలి


తొర్రూరు: ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్

తొర్రూరు : సమాచార హక్కు చట్టంపై (ఆర్టీఐ) అవగాహన కలిగి ఉండి ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందిచే తహసీల్దార్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలకు పారదర్శక పాలన అందించడమే సమాచార హక్కు చట్టం ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ నర్సయ్య, ఆర్ఐ నజీముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.


బయ్యారం: ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది

తహసీల్దార్ కార్యాలయంలో ప్రతిజ్ఞ

బయ్యారం : సమాచార హక్కు చట్టం-2005 వారోత్సవాల్లో భాగంగా గురువారం బయ్యారంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజుతో పాటు సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టాన్ని గౌరవించి పౌరులు కోరిన సమాచారంను సకాలంలో అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిక



చిన్నగూడూరు : అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఉగ్గంపల్లిలో గల తన నివాసంలో దంతాలపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు షేక్ బాజీ, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ కుమార్, హాథీరాం, రాంబాబు ఉన్నారు.

విద్యాభివృద్ధికి పాటుపడాలి



తొర్రూరు రూరల్ : పేదల విద్యాభివృద్ధికి పాటుపడాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాంనర్సయ్య తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని మాటేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు అందజేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎల్లాగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రామనర్సయ్య మాట్లాడారు. క్లబ్ కార్యదర్శి ముడుపు రవీందర్‌రెడ్డి, కోశాధికారి వజినపల్లి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి బోనగిరి శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



పెద్దవంగర : మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర ఆధ్వర్యంలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. క్లబ్ మండల అధ్యక్షుడు తంగెళ్లపల్లి మల్లికార్జున చారి సమక్షంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ విజయలక్ష్మి, సూపర్ వైజర్ శోభ, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు చిదిరాల నవీన్, దామెర సరేష్, ముత్తినేని శ్రీనివాస్, ఎడెల్లి మధుసూదన్ రెడ్డి, కసరబోయిన సుభాష్, జలగం సతీష్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కర్రకోత మిషన్లు స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..

దంతాలపల్లి : మండలంలోని వేములపల్లిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను కోసిన వారి నుంచి కర్రకోత మిషన్లను గ్రామ కార్యదర్శి శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగన్న గురువారం స్వాధీనం చేసుకున్నారు. 'అక్రమంగా చెట్ల నరికివేత' అనే శీర్షిక సాక్షిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందా! ఇస్తే ఎన్ని చెట్లకు అనుమతి ఇచ్చిందనే విషయంపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. అలాగే రామానుజాపురం గ్రామంలో విద్యుత్ లైన్ వేయడం కోసం రోడ్డు పక్కన ఉన్న చెట్లను తొలగించడంపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది.

ఎన్నిక


ఉప్పలయ్య

మరిపెడ రూరల్ : తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్స్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ-సీడబ్ల్యూఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మండలంలోని అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన కొండ ఉప్పలయ్య గురువారం ఎంపికయ్యారు. ఈ ఎన్నికను హైదరాబాద్ సుందరయ్య భవనంలో సంఘం రాష్ట్ర నాలుగో మహాసభల్లో ఈ ఎన్నిక నిర్వహించారు. నూతన రాష్ట్ర కమిటీని 18 మందితో ఎన్నుకోగా మరిపెడ నుంచి ఉప్పలయ్యకు స్థానం దక్కింది.ఆ సంఘం నాయకులు తదితరులు ఉప్పలయ్యను అభినందించారు.

చిందరవందరగా పట్టా పాస్‌బుక్ జిరాక్స్ పత్రాలు



మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలోని లచ్చతండా గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదిక వద్ద గిరిజన రైతులకు చెందిన పట్టా పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు జిరాక్స్‌లు చిందరవందరంగా పడేసి ఉన్నాయి. లచ్చతండా రైతు వేదిక వద్ద యూరియా బస్తాల పంపిణీ కోసం ఏఈఓ జిరాక్స్ పత్రాలను సేకరించినట్లు తెలిపారు. బస్తాల పంపిణీ తర్వాత పత్రాలను రైతు వేదిక నుంచి బయట పడేశారు. దీంతో రైతు వేదిక ఎదుట జిరాక్స్ పత్రాలన్ని చిత్తుకాగితాలుగా చిందరవందరగా పడి ఉన్నాయి. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వ్యవసాయ శాఖ అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


చిన్నగూడూరు: మాట్లాడుతున్న సీడీపీఓ ఎల్లమ్మ

- సీడీపీఓ ఎల్లమ్మ

చిన్నగూడూరు : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఎల్లమ్మ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ మాసం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం లభిస్తుందన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. పిల్లల ఎదుగుదల, శారీరక, మానసిక వికాసం కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పరిసరాల శుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ తేజ కళ్యాణి, సూపర్వైజర్ శ్రీలత, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీఓ రజని, ఏపీఎం నరసింహారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ప్రీస్కూల్ పిల్లల తల్లులు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.


మరిపెడ రూరల్ అంగన్‌వాడీ కేంద్రంలో..

మరిపెడ రూరల్ : పోషకాహారం తీసుకోవడం వల్ల తల్లిబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషా అన్నారు. గురువారం మరిపెడ మండలంలోని ఎల్లంపేట సెక్టార్ దంటకుంటతండా, బాల్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు నీలబాయి, చింతల విజయలక్ష్మి, జెట్టి ఆహల్య, జర్పుల పద్మ, ఏడబ్ల్యూటీ సుజాత, చిన్నారులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసం

కేసముద్రం : కేసముద్రం మండలం పీక్లా తండా గ్రామశివారు బోడగుట్టతండా అంగన్‌వాడీ సెంటర్‌లో, ఇనుగుర్తి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు దుర్గా, ప్రేమజ్యోతి, హెచ్ఎం యాదగిరి, కార్యదర్శి నివాస్‌రెడ్డి, ఏఎన్ఎం కవిత, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడికి పాల్పడిన నిందితుడిపై కేసు

గార్ల : మండలంలోని పాతపోచారం గ్రామానికి చెందిన పి.శ్రీశైలం తన పొలం పనులకు అదే గ్రామానికి చెందిన ఓ మహిళ బుధవారం కూలీకి వెళ్లింది. తన కుమారుడిని చదువు నిమిత్తం వేరే ఊరికి పంపించేందుకు మధ్యాహ్నం ఇంటికి వచ్చేందుకు సిద్ధమైంది. తాను బైక్ పై ఇంటి వద్ద దింపుతానని రైతు శ్రీశైలం బైక్ పై తీసుకొస్తూ మార్గమధ్యలో ఆమెపై బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన మహిళ రాత్రి సమయంలో ఏడ్చుకుంటూ కుటుంబ సభ్యులకు జరిగిన విషయాన్ని తెలిపింది. కుటుంబ సభ్యులతో కలిసి బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కే రియాజ్‌పాషా గురువారం వెల్లడించారు.

వ్యక్తి అరెస్ట్

కేసముద్రం : మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన బానోత్ మంగు 2013లో ఓ మహిళపై వేధింపులకు పాల్పడ్డాడు. ఈ కేసులో 2019 నుంచి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయగా గురువారం అరెస్టు చేసి, మహబూబాబాద్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

మహబూబాబాద్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు.మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో గురువారం మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు తక్కువ వేతనంతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని,అర్హులైన కార్మికులకు ప్రమోషన్స్ కల్పించాలన్నారు. కార్మికులకు కొబ్బరి నూనె, బూట్లు ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కాంపల్లి శ్రీనివాస్, కుమ్మరికుంట్ల నాగన్న, ఎల్లయ్య, మనోహర్, సైదులు, శ్రీను, పుష్పరాజ్, జగన్, శ్రీకాంత్,పద్మ, వీరన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

పాలకవర్గ పార్టీలను ఓడించండి

నెహ్రూసెంటర్ : దేశం, రాష్ట్రంలో ఉన్న పాలక పార్టీలను ఓడించి ప్రజా ఉద్యమ పార్టీలను స్థానిక ఎన్నికల్లో గెలిపించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాయం చిన్న చంద్రన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎన్నికల సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సుపరిపాలన కోసం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. హామీలను అమలు చేయకుండా, ఎన్నికల్లో లబ్ధి కోసం వస్తున్న పార్టీలను ప్రజలు గుర్తించి ఓడించాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, పూనెం ప్రభాకర్, ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, ఉమ్మగాని సత్యం, ఎల్లన్న, జానకీరాములు, మోషె, వెంకన్న, లచ్చయ్య, రాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రన్న

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

పెద్దవంగర : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దయాకర్‌రావు పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ బాకీ విషయాన్ని ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, నాయకులు పాలకుర్తి యాదగిరి రావు, కనుకుంట్ల వెంకన్న, దుంపల సమ్మయ్య, రాసాల సమ్మయ్య, పసులేటి వెంకట్రామయ్య, తదితరులు పాల్గొన్నారు.


పెద్దవంగర: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

కేసముద్రం/గూడూరు/నెల్లికుదురు : స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ తెలిపారు. గురువారం కేసముద్రం పట్టణంలో, గూడూరు, నెల్లికుదురు మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల గ్యారంటీ కార్డు ప్రకారంగా, హమీలను అమలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నాయకులకు కాంగ్రెస్ బాకీ కార్డులను చూపించి, నిలదీయాలన్నారు. ఆయా కార్యక్రమాలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


గూడూరు: బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, నాయకులు

ఎన్నికల్లో శివసత్తులు పోటీచేయాలి

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శివసత్తులు పోటీచేయాలని బహుజన పూజారుల శివసత్తుల సేవాసమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బాబురావు మహరాజ్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ మండలంలోని గుర్రాలగుట్ట తండా శ్రీసమ్మక్క-సారక్క దేవాలయ సన్నిధిలో గురువారం బహుజన పూజారుల శివసత్తుల సేవా సమితి రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో అధిక సంఖ్యలో శివసత్తులు పోటీచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శివసత్తులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, బహుజన పూజారుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కోరారు. పూజారి సురేష్ స్వామి, నాయకులు బానోత్ భద్రిస్వామి, స్వాములు మంగి, తాటి వెంకన్న, శివ, కళ, సుమన్, వీరన్న, బాలు, సరిత, నీళ్ల లక్ష్మి, నరేష్, పుష్ప, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బాబురావు తదితరులు

కమ్యూనిస్టుల పాత్ర కీలకం

చిన్నగూడూరు : ప్రజా సమస్యలను వెలికితీయడంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గునిగంటి మోహన్ అన్నారు. గురువారం మండలంలోని గుండంరాజుపల్లిలో సీపీఎం గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కమ్యూనిస్టులే కీలకమన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టులను ఆదరించి గెలిపించాలని కోరారు. నాయకులు కాగిత వీరయ్య, కందునూరు సుధాకర్, వీరన్న, లింగన్న, శ్రీను, వీరమల్లు, మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

నెహ్రూసెంటర్ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సీపీఎం టౌన్ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలు పెరుగుతున్నందున ప్రజలు, పార్టీ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్, సమ్మెట రాజమౌళి, హేమ నాయక్, బానోత్ వెంకన్న, ఎర్ర శ్రీనివాస్, ఎండీ రజాక్, మందుల మహేందర్ పాల్గొన్నారు.

మొదటి రోజు ఆరు నామినేషన్లు

మహబూబాబాద్ అర్బన్ : జిల్లాలో మొదటి విడతలో 9 జెడ్పీటీసీ, 104 ఎంపీటీసీల ఎన్నికలకు మొదటి రోజు గురువారం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు జెడ్పీ సీఈఓ పురుషోత్తం తెలిపారు. మహబూబాబాద్ జెడ్పీటీసీకి స్థానానికి స్వతంత్ర అభ్యర్థి ఒక నామినేషన్, తొర్రూరు నుంచి ఎంపీటీసీ స్థానానికి 1, బయ్యారం-4 నామినేషన్లు కాంగ్రెస్ పార్టీ నుంచి దాఖలు చేశారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



కురవి : మండలంలోని నేరడ ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్) విద్యార్థిని నందిని ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీకాంత్ తెలిపారు. దీంతో గురువారం పాఠశాలలో విద్యార్థినిని ఉపాధ్యాములు అభినందించారు. పీడీ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలేరులో జోనల్ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

నెల్లికుదురు : జోనల్ స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ, ఖోఖో క్రీడలు మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభించినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సతీష్ గౌడ్, సెక్రటరీ ఎండీ ఇమామ్ తెలిపారు. ఈ క్రీడల్లో నెల్లికుదురు, ఇనుగుర్తి, కేసముద్రం మండలాలకు చెందిన అండర్-14, 17ఏళ్ల బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంగోత్ రాందాస్, కేసముద్రం ఎంఈఓ కాలేరు యాదగిరి, ఇనుగుర్తి ఎంఈఓ రూపారాణి, వివిధ మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి క్రీడోత్సవాలు

దంతాలపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేటినుంచి క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ శ్రీదేవి తెలిపారు.

ప్రహ్లాద్ సేవలు చిరస్మరణీయం

మహబూబాబాద్ : మున్సిపల్ ఎంప్లాయిస్ సెంట్రల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బి.ప్రహ్లాద్ సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ కొనియాడారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ప్రహ్లాద్ సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ సెంట్రల్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగు రమేష్, డీఈ సీహెచ్ ఉపేందర్, మేనేజర్ శ్రీధర్, ఆర్వో రఘు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కుట్ర

నెహ్రూసెంటర్ : బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు అగ్రవర్ణాలు కుట్రలు చేస్తున్నాయని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ముంజాల రాజేందర్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



తొర్రూరు : పొగాకు, వాటి ఉత్పత్తులు వాడడం వల్ల 60రకాల క్యాన్సర్ బారినపడే అవకాశముందని మండల వైద్యాధికారి బి.నందనదేవి అన్నారు. పొగాకు వల్ల కలిగే అనర్థాలపై వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని ఎంజేపీ బీసీ బాలుర గురుకులంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ నందనదేవి మాట్లాడారు. దంత వైద్యురాలు మీరాజ్, ఎంఎల్‌హెచ్‌పీ స్రవంతి, కానిస్టేబుల్ రవీందర్, ఏఎన్ఎం అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

మహబూబాబాద్ రూరల్ : సంకష్టహర చతుర్థి సందర్భంగా మహబూబాబాద్ పట్టణంలోని శ్రీరామ ఆలయం, క్యాబిన్ రోడ్ నాగేంద్రస్వామి ఆలయంలో నేడు (శుక్రవారం) శ్రీ లక్ష్మీగణపతి హోమం, పంచామృత అభిషేకం నిర్వహించనున్నట్లు అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్, ముడుంబై రామానుజాచార్యులు గురువారం తెలిపారు.

రంగయ్య సంతాప సభ

బయ్యారం: మండలానికి చెందిన సీపీఐ నాయకుడు పుసులూరి రంగయ్య ఇటీవల మృతి చెందారు. కాగా గురువారం ఆ పార్టీ మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్ అధ్యక్షతన రంగయ్య సంతాప సభ నిర్వహించారు. సీపీఐ జాతీయ కమిటీ సభ్యులు భాగం హేమంతరావు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు విజయ్‌సారధిరెడ్డి, ఐలయ్య, మాస్‌లైన్, సీపీఎం, నాయకులు జగ్గన్న, రాజన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు నివాళి

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దార్ల శివరాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు. విజయ్‌కాంత్, ఇసంపల్లి ఉపేందర్, నాగన్న, శ్రీను, సరేష్‌నాయక్, ప్రవీణ్, అరుణ్, హేమంత్, మహేష్ పాల్గొన్నారు.

ఎస్సై ప్రశాంత్‌పై హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ టౌన్ ఎస్సై ప్రశాంత్‌పై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ)లో ఫిర్యాదు చేసినట్లు ముస్లిం సంఘాల తెలంగాణ జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్ ఖాన్ గురువారం తెలిపారు. తన తండ్రి యూసుఫ్ అలీ ఖాన్ పేరుమీద ఉన్న సర్వే నంబర్ 448 భూమిపై దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకునే విషయంలో ఎస్సై ప్రశాంత్ నిర్లక్ష్యం వహించారని తెలిపారు. తన తండ్రి చావుకు పరోక్షంగా దౌర్జన్యకారుల వేధింపులతో పాటు, టౌన్ ఎస్సై ప్రశాంత్ నిర్లక్ష్యం కూడా కారణమని పేర్కొన్నారు. ఎస్సైపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించాలని, తమ భూమి విషయంలో దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలకు ఆదేశించాలని ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

నామినేషన్ కేంద్రం సందర్శన

గూడూరు/ గార్ల : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గార్ల, గూడూరు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియను గురువారం మానుకోట డీఎస్పీ ఎన్.తిరుపతిరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారులను సమాచారం అడిగి తెలుకున్నారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జాగ్రత్తగా పరిశీలించాలి

దంతాలపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు సమర్పించే నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలని తొర్రూరు ఆర్డీఓ గణేష్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీఓ విజయ, ఎస్సై రాజు, అధికారులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

కురవి : స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అలువాల వీరయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలపాల, నేరడ, రాజోలు, కదికొండ గ్రామాల్లో పోటీలో ఉంటామని తెలిపారు. జెడ్పీటీసీ స్థానంతోపాటు సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. మనోహర్, నల్లపు సుధాకర్, పోతుగంటి మల్లయ్య, జక్కుల మల్లయ్య, కడియం సత్యం, కట్ల కృష్ణయ్య, మాలోత్ కిషన్ నాయక్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి గరుడవాహనసేవ



గార్ల : మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి వేంకటేశ్వరస్వామి వారికి దేవాలయ ప్రాంగణంలో ఘనంగా గరుడవాహనసేవ నిర్వహించారు. తొలుత పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి సమేత శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి దేవాలయం చుట్టూ మేళాతాళాల నడుమ గరుడవాహన సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారికి హోమ బలిహరణ కార్యక్రమం చేపట్టారు. నేడు స్వామివారికి కోనేటిలో తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈఓ జి.సంజీవరెడ్డి కోరారు. అర్చకులు, మాజీ సర్పంచ్ అజ్మీరా బన్సీలాల్ నేతృత్వంలో తెప్పోత్సవం నిర్వహించే శకటాన్ని గురువారం ముందస్తుగా పరిశీలించారు.